క్లుప్తంగా

శిశుగృహలోని నలుగురు పిల్లల దత్తత

- పిల్లలను అందజేసిన కలెక్టర్ తమీమ్ అన్సారియా



శిశుగృహలోని పిల్లలను దత్తత తీసుకున్న తల్లిదండ్రులకు అప్పగిస్తున్న కలెక్టర్

ఒంగోలు అర్బన్: శిశుగృహలో ఆశ్రయం పొందుతున్న నలుగురు పిల్లలను కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు చెందిన దంపతులు దత్తత తీసుకున్నారు. శుక్రవారం ప్రకాశం భవనంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా చేతుల మీదుగా పిల్లలను దంపతులకు అందజేసి దత్తత ధ్రువీకరణ ఇచ్చారు. దత్తత తీసుకున్న తల్లిదండ్రులు బెంగళూరు, హైదరాబాద్‌ల్లో సాఫ్ట్‌వేర్ రంగాల్లో స్థిరపడి సెంట్రల్ అడప్షన్ రిసోర్స్ అథారిటీలో ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా 2021లో దరఖాస్తు చేసుకున్నారు. ఆ మేరకు అన్నీ పరిశీలించి శిశుగృహలోని చిన్నారులను దత్తత ఇచ్చారు. పిల్లలకు ఉన్నత భవిష్యత్తు ఉండేలా తీర్చిదిద్దాలని కలెక్టర్ వారికి సూచించారు. దీనిలో జిల్లా బాలల సంరక్షణ అధికారి దినేష్‌కుమార్, ఎస్‌ఏసీ పీవో లక్ష్మి, మేనేజర్ రఫాహెరియట్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన సంతనూతలపాడు ఎస్సై



సంతనూతలపాడు ఎస్సై అజయ్‌బాబు

చీమకుర్తి: సంతనూతలపాడు ఎస్సైగా అజయ్‌బాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు సంతనూతలపాడులో ఎస్సైగా పనిచేసిన ఎం.దేవకుమార్‌ను వీఆర్‌కు పంపించారు. వీఆర్‌లో ఉన్న అజయ్‌బాబును సంతనూతలపాడు ఎస్సైగా నియమించారు.

ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన సురేష్...

సంతనూతలపాడు ఎంపీడీఓగా సురేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కొరిశపాడు మండల ఎంపీడీఓగా పనిచేస్తూ సంతనూతలపాడు వచ్చారు. మండల పరిషత్ సిబ్బంది ఆయనను కలిసి అభినందించారు.

ఇసుక టిప్పర్, ట్రాక్టర్ పట్టివేత



పోలీసులు పట్టుకున్న ఇసుక టిప్పర్

నాగులుప్పలపాడు: అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్, ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. టిప్పర్‌తో పాటు ట్రాక్టర్‌లో అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారని సమాచారం అందడంతో మండలంలోని అమ్మనబ్రోలు వద్ద దాడి చేసినట్లు చెప్పారు. ఇసుక తరలింపు అక్రమమేనని తేలడంతో టిప్పర్, ట్రాక్టర్‌ను నాగులుప్పలపాడు పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. దాడి ఘటనలో ఏఎస్సై సుబ్బారావు పాల్గొన్నారు.

గాజాపై దాడులను ఖండిస్తూ 7న నిరసనలు

ఒంగోలు టౌన్: ఏడాది కాలంగా పాలస్తీనాలోని గాజాపై విచక్షణా రహితంగా దాడులకు పాల్పడుతున్న ఇజ్రాయిల్ దుర్మార్గాలకు వ్యతిరేకంగా ఈ నెల 7వ తేదీ జిల్లా వ్యాప్తంగా వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ తెలిపారు. శుక్రవారం స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత అక్టోబర్ 7వ తేదీ హమాస్‌పై ప్రతీకార దాడి పేరుతో పాలస్తీనాపై ఆటవికంగా ఇజ్రాయిల్ దాడులకు దిగిందన్నారు. నేటికి ఏడాదవుతున్నా దాడులను కొనసాగించడం దుర్మార్గమని అన్నారు. ఈ క్రూరమైన దాడుల ఫలితంగా ఇప్పటి వరకు 42 వేల మంది పాలస్తీనీయుల మరణించారని, వీరిలో అత్యధికంగా మహిళలు, చిన్నారులే ఉండటం విచారకరమని అన్నారు. వాస్తవానికి ఈ సంఖ్య 85 వేలకు మించి ఉండవచ్చని తెలుస్తోందన్నారు. గాజా నగరాన్ని చిన్నారుల శ్మశానవాటికగా యావత్ ప్రపంచం పిలుస్తుందంటే.. అక్కడి పరిస్థితిని అర్థం చేసుకోవచ్చన్నారు. తక్షణమే యుద్ధాన్ని ఆపాలని, కాల్పుల విరమణ పాటించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ డిమాండ్ చేశారు. ఆ మేరకు జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో, జిల్లా కేంద్రంలో నిర్వహించే నిరసన కార్యక్రమాల్లో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో ఎం ఎస్ సాయి, కె.వీరారెడ్డి, కొత్తకోట వెంకటేశ్వర్లు, జీవీ కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు పాల్గొన్నారు.

టర్నింగ్ టెర్రర్..!

- ప్రయాణికుల ప్రాణాలు తీస్తున్న మలుపులు
- 216 జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు
- సూచిక బోర్డులు ఏర్పాటు చేయని అధికారులు



మద్దిరాలపాడు వద్ద ఉన్న మలుపు



ఉప్పుగుండూరు పెట్రోలు బంకు సమీపంలో ప్రమాదకరంగా ఉన్న మలుపు



ఉప్పుగుండూరు మలుపులో తిరగబడిన లారీ (ఫైల్)

నాగులుప్పలపాడు: రోడ్డు మలుపులు ప్రయాణికులకు వణుకు పుట్టిస్తున్నాయి. తరచూ ప్రమాదాలకు కారణమవుతూ ప్రాణాలు తీస్తున్నాయి. అయినప్పటికీ అధికారుల్లో మాత్రం చలనం రావడం లేదు. ఆయా మలుపుల వద్ద ప్రమాదాలు జరగకుండా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్న ఆలోచన కూడా చేయడం లేదు. ఫలితంగా 216వ నంబర్ జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు జరగడం, ప్రాణాలు కోల్పోవడం, గాయాలపాలవడం పరిపాటిగా మారింది. ఈ రోడ్డుపై ఒంగోలు - చీరాల మధ్య నాగులుప్పలపాడు మండలం పరిధిలో అనేక మలుపులు ఉన్నాయి. ఈ రోడ్డు నిర్మాణం తర్వాత గ్రామాల్లోకి వెళ్లేందుకు డైవర్షన్ రోడ్లు నిర్మించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. గ్రామాల్లోకి వెళ్లే మలుపుల వద్ద కొన్నిచోట్ల డైవర్షన్ గుర్తులు కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో ఆయా ప్రాంతాల్లో అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల ఈ రహదారిపై మలుపులను గుర్తించక కొత్తగా ఈ రోడ్డుపై ప్రయాణించే వారు వేగంగా వచ్చి ప్రమాదాలకు గురై ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు.

కొన్నిచోట్ల మలుపు ఉన్న విషయమే తెలియని పరిస్థితి...

నాగులుప్పలపాడు మండలంలోని ఉప్పుగుండూరు పెట్రోలు బంకు సమీపంలో గల మలుపు వద్ద కట్టడాలు జరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలకు ఏమీ కనిపించని పరిస్థితి. వేగంగా వచ్చే వాహనాలకు అసలు అక్కడ మలుపు ఉన్న విషయమే తెలియదు. అలాంటి స్థితిలో చాలా వాహనాలు ప్రమాదాలకు గురై ప్రయాణికులు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. గతంలో ఈ ప్రాంతంలోనే లైసెన్సుడు మద్యం దుకాణం ఏర్పాటు చేయడంతో మద్యం కొనుగోలుదారులను రోడ్డుపై వేగంగా వెళ్లే వాహనాలు ఢీకొన్నాయి. అలా జరిగిన ప్రమాదంలో మండలంలోని ఒమ్మెవరం గ్రామానికి చెందిన వ్యక్తిని లారీ ఢీకొట్టింది. అతను అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. అక్కడ మలుపు ఉన్న సంగతి గుర్తించని లారీ డ్రైవర్ ఒక్కసారిగా దగ్గరకు వచ్చిన తర్వాత మలుపు కనిపించడంతో ఆందోళనకు గురై లారీని తిప్పడంతో ప్రమాదం జరిగిందని విచారణలో తేలింది. ఈ మలుపులోనే అనేకసార్లు లారీలు, మోటారు సైకిళ్లపై వెళ్లే వారు ప్రమాదానికి గురైన సందర్భాలు ఉన్నాయి. అదేవిధంగా ఉప్పుగుండూరు జిల్లా పరిషత్ పాఠశాల దగ్గర్లో ఉన్న మలుపు వద్ద కూడా ఎలాంటి సూచిక బోర్డు ఏర్పాటు చేయకపోవడంతో ఆ ప్రాంతంలో తరచూ పలు వాహనాలు ప్రమాదానికి గురవుతున్నాయి. మద్దిరాలపాడు గ్రామం సిండికేట్ బ్యాంకు సమీపంలోని మలుపు వద్ద గోడ అడ్డుగా ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనం కనిపించే పరిస్థితి లేదు. దీంతో ఈ ప్రాంతంలో కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆటోలు, మోటారు వాహనాల కింద పడి ప్రాణాలు పోగొట్టుకున్న వారితో పాటు అనేకసార్లు గేదెలు వాహనాల కిందపడి మరణించాయి. ఆయా గ్రామాల్లోకి వెళ్లేందుకు జాతీయ రహదారిలో నుంచి రోడ్డు వీలుగా లేకపోవడం, అక్కడ ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో గతంలో మద్దిరాలపాడు గ్రామం వద్ద కాలనీలోకి వెళ్లడానికి రోడ్డు దాటే మహిళను తప్పించబోయి ఉప్పుగుండూరుకు చెందిన ఇద్దరు యువకులు మరణించారు. ఇన్ని ప్రమాదాలు జరుగుతున్నా.. అధికారులు కనీసం రోడ్డు మలుపుల వద్ద, గ్రామంలోకి వెళ్లే ప్రదేశాలలో ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంపై ప్రజలు తీవ్ర స్థాయిలో అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ జెండా ఎగురవేస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, మేరుగు నాగార్జున, తదితరులు



లాయర్‌పేట సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ మంత్రులు ఆదిమూలపు సురేష్, మేరుగు నాగార్జున, తదితరులు

బూచేపల్లి నాయకత్వంలో వైఎస్సార్ సీపీ బలోపేతం కావాలని పూజలు...

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షునిగా దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి నాయకత్వంలో పార్టీ దినదినాభివృద్ధి చెంది బలోపేతం కావాలని కోరుకుంటూ పార్టీ సాంస్కృతిక విభాగం జోనల్ ఇన్‌చార్జ్ బొట్లా సుబ్బారావు ఆధ్వర్యంలో ఒంగోలులోని విఘ్నేశ్వర దేవాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పాల్గొన్నారు. అనంతరం బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని శాలువాతో సన్మానించి బొకే అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ బొట్లా రామారావు, చావలి శివప్రసాద్, 14వ డివిజన్ కార్పొరేటర్ ఇమ్రాన్‌ఖాన్, నాయకులు కుట్టుబోయిన కోటియాదవ్, ఫణిదపు సుధాకర్, భూమిరెడ్డి రమణమ్మ, ఉప్పలపాటి శ్రీనివాసరాజు, బొట్ల మాల్యాద్రి, బొబ్బాల భాను, జాజుల శ్రీను, పలదెళ్ల ఆంజనేయులు, రాజు నాగిరెడ్డి, వేల్పూరి రామారావు, పాలపర్తి సుబ్బారావు, బీఎస్ఎన్ఎల్ రాఘవయ్య, యన్నాబత్తుని సంతోష్, కుట్టుబోయిన సురేష్, మిరియం వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

జనజాతర

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షునిగా అట్టహాసంగా బాధ్యతలు స్వీకరించిన దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి
- భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులతో కిక్కిరిసిన ఒంగోలు నగరం

చీమకుర్తి: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షునిగా దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి శుక్రవారం అట్టహాసంగా ఒంగోలు నగరంలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. తన తల్లి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మతో పాటు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధుల సమక్షంలో శివప్రసాద్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులతో ఒంగోలు నగరం రద్దీగా మారింది. ఒంగోలులో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించే కార్యక్రమంలో పాల్గొన్న వారితో చర్చి సెంటర్ కిక్కిరిసింది. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయం, చుట్టుపక్కల ప్రాంతాలు, రహదారులన్నీ పార్టీ శ్రేణులతో కిటకిటలాడాయి.

చీమకుర్తిలో వైఎస్సార్ విగ్రహానికి బూచేపల్లి నివాళులు

ఒంగోలులో బాధ్యతలు స్వీకరించే ముందుగా చీమకుర్తిలోని బూచేపల్లి కల్యాణ మండపం వద్ద ఉన్న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, దర్శి మాజీ ఎమ్మెల్యే, తన తండ్రి బూచేపల్లి సుబ్బారెడ్డి విగ్రహాలకు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. తన తల్లి, జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మతో కలిసి గజమాలలతో విగ్రహాలకు నివాళులర్పించారు. అదే సమయంలో మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ కూడా బూచేపల్లి శివప్రసాదరెడ్డిని చీమకుర్తిలో కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఒంగోలులో బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి బయలుదేరి వెళ్లారు. ఆయనకు మద్దతుగా చీమకుర్తి, సంతనూతలపాడు మండలాల నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొని వారితో పాటు ఒంగోలు తరలివెళ్లారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, కౌన్సిలర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. చీమకుర్తి నుంచి ఒంగోలు వెళ్తున్న సమయంలో మధ్యలో సంతనూతలపాడు మండల కేంద్రంలో ఆ మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, ఎంపీపీ బీ విజయ, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, సర్పంచ్ దర్శి నాగమణి బూచేపల్లిని కలిసి పూలమాలలతో శుభాకాంక్షలు తెలిపారు.



కొత్తపట్నం నుంచి ఒంగోలు తరలివెళ్తున్న ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు



బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి అభినందనలు తెలుపుతున్న మాజీ మంత్రులు పేర్ని నాని, ఆదిమూలపు సురేష్, మేరుగు నాగార్జున, జూపూడి ప్రభాకర్, బన్నీ, తదితరులు



ఒంగోలు చర్చిసెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించే కార్యక్రమంలో భారీగా పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు



బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి అభినందనలు తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

బూచేపల్లికి మద్దిపాడు నేతల అభినందనలు

మద్దిపాడు: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిన దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డితో పాటు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మను ఆ పార్టీ మద్దిపాడు మండల అధ్యక్షుడు మండవ అప్పారావు, ప్రధాన కార్యదర్శి వాకా కోటిరెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఒంగోలులో నిర్వహించిన బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ప్రమాణస్వీకార కార్యక్రమానికి మద్దిపాడు మండలంలోని అన్ని గ్రామాల నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు కార్లలో ర్యాలీగా తరలివెళ్లారు. ఒంగోలులోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయానికి చేరుకుని ప్రమాణ స్వీకారం అనంతరం శివప్రసాదరెడ్డిని కలిసి శాలువాలు కప్పి పూలదండలతో సన్మానించారు.

కొత్తపట్నం మండలం నుంచి తరలిన నేతలు...

కొత్తపట్నం: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షునిగా దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి కొత్తపట్నం మండలం నుంచి ఆ పార్టీ నాయకులు భారీగా ఒంగోలు తరలివెళ్లారు. ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి ఆధ్వర్యంలో కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలకు వైఎస్సార్ సీపీ జెండాలు కట్టుకుని నినాదాలు చేసుకుంటూ ర్యాలీగా వెళ్లారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఫొటోలతో ఉన్న టీషర్టులు ధరించిన యువకులు ద్విచక్ర వాహనాలతో ఉత్సాహంగా పాల్గొన్నారు.



బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ మద్దిపాడు మండల అధ్యక్ష, కార్యదర్శులు



చీమకుర్తిలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ, నాయకులు



సభకు తరలివస్తున్న నాయకులు, కార్యకర్తలు



సంతనూతలపాడులో స్వాగతం పలుకుతున్న దుంపా చెంచిరెడ్డి, రమణమ్మ

గాయత్రీ మాతా పాహిమాం..



అచలానందాశ్రమంలో గాయత్రీ మహాదేవి అలంకరణలో గోవిందమాంబ అమ్మవారు

దసరా దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం రెండో రోజు ఒంగోలు నగరంలోని ఆలయాల్లో అమ్మవారు గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు విశేష పూజలు, అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించగా, భక్తులు భారీగా పాల్గొన్నారు. అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పలు దేవస్థానాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

\- ఒంగోలు మెట్రో



లాయరుపేట సాయిబాబా ఆలయంలో శ్రీచక్ర పూజలో పాల్గొన్న మహిళలు



గాయత్రీదేవి అలంకరణలో ఒంగోలు బాలాజీరావుపేట కనకదుర్గాదేవి



ప్రసన్నచెన్నకేశవస్వామి ఆలయంలో శాస్త్రీయ నృత్యం చేస్తున్న నళినీప్రియ కళానిలయం విద్యార్థినులు



అచలానందాశ్రమంలో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళా భక్తులు



గంటాపాలెంలో పూజలందుకుంటున్న పార్వతీదేవి



అమ్మవారి భజనలో పాల్గొన్న భవానీ మాలధారణ మహిళలు